క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి


ఉషారాణి, ఎంపీపీ అరకులోయ

అరకులోయ రూరల్: తుపాను ప్రభావంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అరకులోయ ఎంపీపీ రంజపల్లి ఉషారాణి ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ఎవరూ దాటే సాహసం చేయవద్దని సూచించారు. అందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అత్యసరమైతే మినహా బయటకు రావొద్దని ఇంటి వద్దనే ఉండాలని కోరారు.

140 మందికి వైద్య పరీక్షలు


రోగులకు దోమతెరలు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ చైర్మన్ బాలస్వామి

చింతూరు: ఓంకార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీఆర్ పురం మండలం కుల్తనూరు, చొక్కనపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీంతోపాటు దోమతెరలు, రొట్టెలు, పండ్లు అందించారు. జీడిగుప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి సూర్య ప్రకాష్, ట్రస్ట్ చైర్మన్ బాలస్వామి, రాజేష్, మహేంద్ర, వెంకటేశ్వర్లు సలీమ్, శ్రీలత పాల్గొన్నారు.

10న రాస్తారోకో

అరకులోయ రూరల్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ విధానాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్న రాస్తారోకోను విజయవంతం చేయాలని సీటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు తెలిపారు. అన్ని వర్గాలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు

రంపచోడవరం: రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషిరెడ్డి తెలిపారు. ఏరియా ఆస్పత్రి వైద్య సేవలు సక్రమంగా లేవని రంపచోడవరం జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి ఇటీవల కాకినాడ జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడిన విషయాలపై వచ్చిన వార్తకు ఆయన వివరణ ఇచ్చారు. ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు


లోత సూరిరెడ్డి

వై.రామవరం: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఈ నెల 6వ తేదీ రాత్రి మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలియజేసిన వివరాలివి. ఈనెల 5వ తేదీ రాత్రి మండలంలోని దేవరమడుగులు గ్రామానికి చెందిన లోత సూరిరెడ్డి(33) అనే వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని ఆచూకీ లభించకపోవడంతో 6వ తేదీ రాత్రి అతని భార్య లోత వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

రహదారి నిర్మాణానికి పీవో హామీ


ఐటీడీఏ పీవో అభిషేక్‌కు వినతిపత్రం ఇస్తున్న వార్డు సభ్యులు, సర్పంచ్ తదితరులు

కొయ్యూరు: గరికబంధ జంక్షన్ నుంచి గరిమండ వరకు సుమారు మూడు కిలోమీటర్ల రహదారిని ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్‌కు వినతిపత్రం ఇచ్చినట్టు సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. రహదారి లేక కొన్ని రోజుల కిందట మృతదేహాన్ని డోలీమోతపై తీసుకెళ్లిన విషయాన్ని పీవోకు వివరించినట్టు చెప్పారు. దీనిపై పీవో అభిషేక్ స్పందిస్తూ వర్షాలు తగ్గిన వెంటనే పనులు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. పంచాయతీలో 30 మంది వరకు పిల్లలున్న పిట్టలపాడులో ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ పాఠశాలను ఏర్పాటు చేయాలని డీఈవో బ్రహ్మాజీరావుకు వినతిపత్రాన్ని ఇచ్చామన్నారు. పాఠశాల లేక అక్కడ పిల్లలు పడుతున్న అవస్థలను వివరించామని తెలిపారు. దీనిపై డీఈవో బ్రహ్మాజీరావు సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

గణపతి నమోస్తుతే


ముంచంగిపుట్టులో ఏర్పాటు చేసిన 12 అడుగుల భారీ గణనాథుడు


రాతులపుట్టులో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు


పెదబయలులో గణేష్ నిమజ్జన ఊరేగింపులో భక్తులు


చొడుపల్లిలో వినాయక చవితి పూజలో పాల్గొన్న మహిళలు


కూనవరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఆర్టీసి కాంప్లెక్స్ రోడ్డులో వినాయ విగ్రహం


డుంబ్రిగుడలో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు


లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ముంచంగిపుట్టు: విఘ్నాలు తొలగించే వినాయక చవితి పండగను శనివారం భక్తజనం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో, విధుల్లో , ఇళ్లల్లో వినాయక విగ్రహాలు , గణనాథుని ప్రతిమలు ప్రతిష్ఠించారు. ఆలయాలు, మండపాలను సుందరంగా, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇళ్లను మామిడితోరణాలతో అలంకరించారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి, కొత్త దుస్తులు ధరించి వినాయకుని ఆలయాలకు తరలివెళ్లారు. గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. వాడవాడలా ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో వినాయకునికి విగ్రహాలను ఏర్పాటుచేశారు. ప్రసాదాలు, ఉండ్రాళ్లు తయారు చేసి పంచిపెట్టారు. పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను ఊరేగింపు చేసి సమీపంలోని గెడ్డలలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో థింసా నృత్యాలతో సందడి చేశారు. కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం భారీఅన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. మండపాల్లోని వివిధ రూపాలలో గణనాథులు ప్రత్యేక ఆకరణగా నిలిచాయి. వినాయకుని నామస్మరణతో గ్రామాలన్నీ మార్మోగాయి.

ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 12 అడుగుల గణనాథుడుకి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

అడ్డతీగల: మండల కేంద్రంలోని పవనగిరి క్షేత్రంలో క్షేత్రంలో వినాయకునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. లక్ష్మీగణపతి ఆలయంలో భారీ విగ్రహాన్ని నెలకొల్పి పూజలు చేశారు. వినాయకుని విగ్రహం వద్ద గెద్దాడ నాగరాజు ఇచ్చిన 27 కిలోల లడ్డుతో పాటు బొండా పెద్ద ఇచ్చిన 25 కిలోల లడ్డూని ఉంచి పూజలు చేశారు. ప్రసన్న విఘ్నేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

డుంబ్రిగుడ/హుకుంపేట/గూడెంకొత్తవీధి/సీలేరు/చింతపల్లి/పెదబయలు/కూనవరం/రంపచోడవరం : మండల కేంద్రంతో పాటు అరకు, కించుమండ, గుంటసీమ, చాపరాయి పర్యాటక కేంద్రాల్లో శనివారం వినాయక చవితిని ఘనంగా జరుపుకున్నారు. సీలేరులో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటుచేసిన గణనాథుని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. మండల కేంద్రంతో పాటు చొడుపల్లి, లంబసింగి, తాజంగి, లోతుగడ్డ, కొమ్మంగి ప్రాంతాల్లో గణనాథుని భారీ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజ కార్యక్రమాలు చేపట్టారు. కొయ్యూరులో ఘనంగా వినాయక చవితి నిర్వహించారు. పెదబయలు మండల కేంద్రంతో పాటు సీతగుంట, రోగులపేట, అరడకోట.గలగండ, గంపరాయి, పెదకోడాపల్లి, కిముడుపల్లి, గోమంగి, బొండాపల్లి, గుల్లేలు, లింగేటి, బొంగరం, రూడకోట తదితర ప్రాంతాల్లో గణనాథుని విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు.కొన్ని గ్రామాల్లో వినాయక చవితి రోజే పూజలు చేసి నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో వినాయక ప్రసాదంగా పెట్టిన లడ్డూను కమిటీ సభ్యులు లడ్డూ వేలంపాట నిర్వహించారు. పెదబయలు గ్రామ పెద్దలు.వర్తకులు.మోటర్ యూనియన్ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.కూనవరం మండల కేంద్రంతో పాటు టేకులబోరు, జగ్గవరం, భీమవరం, కొండ్రాజుపేట, కరకగూడెం, నర్సింగపేత, చినార్కూరు, పెదార్కూరు తదితర గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసి గణనాథుని విగ్రహాలను ప్రతిష్టించారు.

రంపచోడవరం మండల కేంద్రంలోని పలు చోట్ల వినాయక మండపాలు ఏర్పాటు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు.


సీలేరులో పూజలు చేస్తున్న భక్తులు


గూడెంకొత్తవీధిలో వినాయకుని మండపం వద్ద భక్తులు


చింతపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు


కొయ్యూరులో గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు,విద్యార్థులు

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న సర్పంచ్ జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు

అరకులోయ రూరల్: మండలంలో మాడగ పంచాయతీ కేంద్రంలో రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఎనిమిది ఇళ్లలు దెబ్బతిన్నాయని సర్పంచ్ ఎం.జ్యోతి తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదనీరు ఎక్కువ రావడంతో మాడగడ గ్రామనికి చెందిన రామకృష్ణ, కొండబాబు, రాజులమ్మ, వెంకట్, పండు, అద్దు, అనంతచారిల గృహాలు స్వల్ప దెబ్బతిన్నట్టు తెలిపారు. ఇళ్ల లోపల రెండు అడుగుల మేర వర్షపునీరు చేరడంతో నిత్యావసర సరకులతో పాటు సామగ్రి తడిసి పాడైనట్టు చెప్పారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బాలరాజు, డీటీ మత్స్యరాజు, వీఆర్వో అమల తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

డుంబ్రిగుడ: భారీ తుపాను వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని తహసీల్దార్ నాగమ్మ అన్నారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తుపాను ప్రభావం వల్ల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు పొంగి, గెడ్డలను ఎవరూ దాటే సాహసం చేయవద్దన్నారు. పంచాయతీల వారీగా వీఆర్ఏలను, రెవెన్యూ సిబ్బందిని, వైద్యసిబ్బందిని అప్రమత్తంగా చేశామన్నారు. అత్యవసరమైతే తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి 24గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉంచామన్నారు. పంట, గృహా నష్టలు, ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే ఆర్ఐ హరిను సంప్రదించాలని ఆమె కోరారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు


ఒడిశా పోలీసు అధికారులతో చర్చిస్తున్న అరకు సీఐ హిమగిరి

అరకులోయ రూరల్: గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు అరకులోయ సీఐ ఎల్.హిమగిరి తెలిపారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్థర్ ఆదేశాల మేరకు గత రెండు రోజుల నుంచి ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో ప్రత్యేక సిబ్బందితో నిఘా వేసి ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా అడ్డుకట్టకు ఇరు రాష్ట్రాల పోలీసుల సహయ సహకారం కోసం కొరాపుట్ జిల్లా పాడువ పోలీస్ స్టేషన్‌లో ఒడిశా పోలీసులతో చర్చలు జరిపినట్టు తెలిపారు. గంజాయి కేసుల్లో యువత ఇరుక్కొని జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ఇక్కడ ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల పరిసరాల్లో నిత్యం నిఘా పెట్టేందుకు ఇరు రాష్ట్ర పోలీసులు కలిసి ఆపరేషన్‌కు ప్రత్యేక దృష్టి సారిస్తున్నమన్నారు. అరకులోయ ఎస్.సంతోష్, ఒడిశా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో తెరిపివ్వని వాన

- ఊరుములు, మెరుపులతో భారీ వర్షం
- ఉధృతంగా వాగులు, గెడ్డలు
- గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- నీట మునిగిన పొలాలు
- ఆందోళనలో గిరిజనులు


బిరిగూడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు


జీకే వీధిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


యార్లగడ్డ- వై.రామవరం గ్రామాల మధ్య కొండవాగు ఉధృతి


అరకులోయలో కురుస్తున్న వర్షం



పర్యాటకులు లేక ఖాళీగా గిరిజన మ్యూజియం



చాపరాయిలో అనుమతించకపోవడంతో గేటు వద్ద పర్యాటకులు


నేలమట్టమైన గిరిజనుడి ఇల్లు


చీడిపుట్టు వంతెన వద్ద కాపలా కాస్తున్న రెవెన్యూ, పోలీస్ శాఖ సిబ్బంది


పెదబయలులో కురుస్తున్న వర్షం


లక్ష్మీపురంలో వర్షానికి దెబ్బతిన్న ఇంటి గోడ

అరకులోయటౌన్: బంగాళాఖాతంలోని అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఏకధాటికి శనివారం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చాలా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చాలా ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. రహదారులకు అడ్డంగా చెట్లు కూలాయి. శివారు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలన్నీ నీట మునిగాయి. పొలాల్లో ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. తెరిపివ్వని వానతో పలుచోట్ల గృహాలు దెబ్బతిన్నాయి. పర్యాటక ప్రాంతాలు బోసిపోయాయి. సోమవారం పలు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు.

అరకులోయ రూరల్: తుపాను కారణంగా ఆదివారం సందర్శిత ప్రాంతాల్లో పర్యాటకులు రాలేదు. దీంతో పర్యాటక ప్రాంతలైన గిరిజన మ్యూజియం, కాఫీ మ్యూజియం, రణజిల్లేడ జలపాతం, పద్మాపురం గార్డెన్ బోసిపోయింది.

డుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ మొర్రిగుడ గ్రామంలో వంతల బాలేశ్వరరావు అనే గిరిజనుడి పెంకిటిల్లు వర్షాలకు నేలమట్టమైంది.

హుకుంపేట: హుకుంపేట నుంచి అడ్డుమండ ప్రధాన రహదారిలో చీడిపుట్టు వంతెనపై వరద నీరు పొంగి ప్రవహించడంతో రాకపోకలు జరగకుండా పోలీసు, రెవెన్యూ శాఖ సిబ్బంది గస్తీ చేపడుతున్నారు.

పెదబయలు: పెదకోడాపల్లి పంచాయతీ పరదానిపుట్టు సమీపంలో మత్స్యగెడ్డపై వరదనీరు కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తోంది. కిముడుపల్లి పంచాయతీ చేదుపుట్టులో గేదెగెడ్డ పొంగి ప్రవహిస్తోంది. జామిగుడ, గిన్నెలకోట, గుల్లేలు, ఇంజరి పంచాయతీలకు సంబంధాలు తెగిపోయయి. వరదానిపుట్టు గ్రామ సమీపంలో మత్స్యగెడ్డ, చేదు గ్రామ సమీపంలో చేదుపుట్టు గెడ్డలు కాజ్‌వేలపై వరదనీరు ప్రవహిస్తోంది.జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పెదకోడాపల్లి, కిముడుపల్లి, కుంతుర్ల, గోమంగి, గుల్లేలు పంచాయతీ ప్రజలు పెదబయలు మీదుగా ఆదివారం ప్రయాణించారు. ఈ రోడ్డు పూర్తిగా బంద్ అయింది.

ముంచంగిపుట్టు: మండలంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు లక్ష్మీపురం, బుంగాపుట్టు, కుమడ, బూసిపుట్టు పంచాయితీల్లో వాగులు, గెడ్డలు వరదనీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. సుత్తిగూడ, బిరిగూడ గ్రామాల్లోని కల్వర్టులపై నుంచి భారీగా వరదనీరు ప్రవహించడంతో 28 గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి. లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో వంతాల సహదేవ్ అనే గిరిజనుడి గృహం దెబ్బతింది.

గూడెంకొత్తవీధి: మండలంలోని శ్యామగెడ్డతో పాటు కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నాయి. కె.జలుమూరులోని కోళ్ల ఫారం వర్షం ధాటికి కూలిపోయింది. సుమారు 30 కోళ్లు మృతి చెందినట్టు తెలిసింది. రహదారులపై నుంచి వర్షపునీరు పొంగి ప్రవహిస్తోంది. విద్యుత్ సరఫరా నిలచిపోయింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో జనజీవనం స్తంభించింది.

కొయ్యూరు: మండలం నుంచి చింతపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రామరాజుపాలెం–పెదమాకవరం మధ్య ఒక వంతెన, నల్లగొండ–పెదమాకవరం మధ్య మరో వంతెన ఏర్పాటు చేస్తున్నారు. నల్లగొండ–పెదమాకవరం మధ్య నిర్మించిన కాజ్‌వే కొట్టుకుపోయింది. కృష్ణాదేవిపేట నుంచి చింతపల్లికి వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు సైతం నిలిచిపోయాయి. కొయ్యూరు, కాకరపాడు కాలువల ఉధృతి పెరిగింది. కొయ్యూరు సంత జనాలు లేక బోసిపోయింది. వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


సీలేరులో కురుస్తున్న వర్షం

అప్రమత్తంగా ఉండాలి

చింతపల్లి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎటువంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా లంబసింగి, డౌనూరు మధ్య ఘాట్ రోడ్‌లో వాహనాల రాకపోకలు నిలుపుదుల చేస్తున్నట్టు తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు లంబసింగి ఘాట్ రోడ్లో కొండ చరియలు విరిగిపడడంతో పాటు రోడ్లపై జారీ వచ్చే ప్రమాదం ఉన్న నేపథ్యంలో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ మార్గంలో వాహన రాకపోవలను నిషేధించామని, వాహనదారులు గమనించాలని కోరారు. లంబసింగి చెక్ పోస్ట్ వద్ద వాహనాలు రాకపోకలు నిలుపుదల చేస్తు ఎస్ఐ అరుణ్‌కిరణ్ చర్యలు చేపట్టారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామకృష్ణ రెవెన్యూ, పంచాయతీ, వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు.

సీలేరు: సీలేరులోని పిల్లిగెడ్డ, వలసగెడ్డ వాగులు పొంగిపొర్లుతున్నాయి. మండల అధికారులు ఎవరూ లేకపోవడంతో సహాయక చర్యలు ఆందక గిరిజనులు వాగులు దాటటానికి భయపడుతున్నారు.

వై.రామవరం: మండలంలోని ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, గెడ్డల వద్ద పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందిని ఎంపీడీవో కె.బాపన్నదొర ఆదేశాల మేరకు కాపలా కాస్తున్నారు. ఆయా ప్రాంత ప్రజలను అప్రమతం చేస్తున్నారు. మండలంలోని యార్లగడ్డ, గురమంద, చింతకర్రపాలెం, శింగవరం, దేవర మడుగులు, కోట, శిరిమెట్ల, కొమరవరం తదితర గ్రామాల సమీపంలోని కొండవాగులు పొంగిపొర్లుతున్నాయి.

అడ్డతీగల: భారీ వర్షాల వల్ల కన్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. బుకురాతిపాలెం, పింజరికొండ, గడిచిన్నంపాలె, కృష్ణవరం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగులపై రాకపోకలు సాగించవద్దని హెచ్చరిస్తున్నారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి శివారు అప్పలరాజుపేటలోని వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు వరదనీరు ఉధృతితో మదుము ద్వారా దిగువకు ప్రవహిస్తోంది. జడ్డంగిలోని మడేరు ఆనకట్ట ఉరకలెత్తుతు ఏలేశ్వరంలోని ఏలూరు ప్రాజెక్టు వైపు పారుతోంది. లబ్బర్తి, లాగరాయి, శరభవరం, శాంతినగర్‌ల సమీపాల్లోని కొండ వాగులు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నాయి.